క్లుప్తంగా

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

పాల్వంచరూరల్: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సమష్టిగా పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ కోరారు. పెద్దమ్మ గుడి వద్ద ఫంక్షన్ హాల్లో శుక్రవారం పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మాట్లాడుతూ.. పార్లమెంట్, అసెంబ్లీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు బ్యాంక్ పెరిగిందన్నారు. మరింత శక్తిని కూడ తీసుకుని రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు చేయూత

సూపర్‌బజార్(కొత్తగూడెం): మరణించిన జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు చేయూతను అందించేందుకు తెలంగాణ మీడియా అకాడమీ ముందుకొచ్చిందని మీడియా అకాడమీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ప్రతీనెల రూ.1000 చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి ఈనెల 28వ తేదీలోపు సెక్రటరీ, తెలంగాణ మీడియా అకాడమీ, ఇంటినెంబరు 5–9–166, చాపల్‌రోడ్, నాంపల్లి, హైదరాబాద్, 500001 చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఇల్లెందు: మున్సిపల్ శానిటేషన్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుడు కొల్లాపూరి వేణు వాల్ పోస్టర్‌ను ప్రదర్శిస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట వినూత్నంగా ఆందోళన నిర్వహించారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో 20 నెలల పీఎఫ్ ఏమైందని, 12 నెలల నుంచి పెరిగిన వేతనాలు ఎందుకు చెల్లించటం లేదని వాల్ పోస్టర్‌లో ప్రశ్నించారు. సీఐటీయూ నాయకులు తాళ్లూరి కృష్ణ, వేణు కమిషనర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాలకు రిజిస్ట్రేషన్, రెన్యూవల్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ మెడికల్ ల్యాబ్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేనిని కలిసి వినతిపత్రం అందించి, సన్మానించారు.

పోడుకు పట్టాలివ్వాలి

జూలూరుపాడు: గిరిజన, గిరిజనేతర పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు ఎస్కే ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమవేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న పోడుభూములు, హరితహారం పేరుతో పేదల నుంచి లాక్కున్న భూములకు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. వల్లోజి రమేష్, నరసింహారావు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

మునగ సాగుపై అవగాహన

టేకులపల్లి: మునగ సాగుతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఇల్లెందు డివిజన్ వ్యవసాయ అధికారి పి.వాసవీరాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కోయగూడెం పంచాయతీ గంగాపురం గ్రామంలో రైతులకు మునగ సాగు వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. రైతులు ఒక ఎకరంలో 36 కుంటల్లో మునగ మొక్కలు, 4 కుంటల్లో ఫార్మ్ పాండ్ వేసుకుంటే గ్రామీణ ఉపాధి హామీ కింద ఫండింగ్ ఇస్తామని తెలిపారు.

26న ఎన్నికలు

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కొత్తగూడెం ఏరియా వర్క్‌షాపులో ఈనెల 26న సొసైటీకి ఎన్నికలు జరగతున్నాయని ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ శుక్రవారం తెలిపారు. ఏడు స్థానాలలో ఒకటి మహిళ (పంప్ ఆపరేటర్) ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మరో పోస్టు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థికి రిజర్వేషన్‌లో కేటాయించగా మిగిలిన జనరల్ కేటగిరిలో ఐదు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని, ఐఎన్‌టీయూసీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా గురువులు ఆసనాలు వేయించారు. మాట్లాడుతూ... నిత్యం బిజీబిజీగా గడుపుతున్న మనిషికి వ్యాయామం అవసరమని, ఇంటి వద్దే ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రతీఒక్కరూ యోగా చేయడానికి రోజులో కొంతసమయం కేటాయించాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: యోగా చేస్తున్న జీఎం జాన్ ఆనంద్, సింగరేణి ఉద్యోగులు


కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): యోగా చేస్తున్న కార్పొరేట్ అధికారులు, ఉద్యోగులు


పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


సూపర్‌బజార్(కొత్తగూడెం): యోగాసనాలు వేస్తున్న మహిళలు


ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో...


ఇల్లెందు: యోగా చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య


కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): బ్రహ్మర్షి విశ్వామిత్ర యోగా ధ్యాన కేంద్రంలో..


కొత్తగూడెంరూరల్: 6వ బెటాలియన్‌లో..


టేకులపల్లి: సులానగర్ ఉన్నత పాఠశాలలో..


జూలూరుపాడు: హైస్కూల్‌లో...

అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తా..

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని గట్టాయిగూడెం, విద్యుత్ కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజల ఆదరణ మరువలేనన్నారు. మున్సిపాలిటీలోని ప్రతీ వార్డులో అంతర్గత రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరు సమస్యలు లేకుండా చూస్తామన్నారు. శాశ్వత ప్రాతిపాదికన అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, తహసీల్దార్ వినయ్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, మండల కార్యదర్శి పూర్ణచందర్‌రావు, రాహుల్, సుధాకర్, మనోహర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి


మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

టేకులపల్లి: తెలంగాణ కొంగు బంగారమైన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేఓసీ పిట్ సహాయ కార్యదర్శి బానోతు బాలాజీ కోరారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో కేఓసీ బొగ్గు గని వేలాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేఓసీ మేనేజర్ సౌరభ్ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థ పరిధిలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు. తెలంగాణ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వైఖరి మారాలని, తెలంగాణ ప్రాంతంలో ఉన్న అతి ముఖ్యమైన, కొంగు బంగారం అయిన సింగరేణి సంస్థ కొనసాగాలంటే కొత్త గనులు రావడం తప్పనిసరి అని, ఈ గనులను వేలంపాట ద్వారా కాక నేరుగా ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల వేలంపాటలో పెట్టిన సత్తుపల్లి, కోయగూడెం ఓపెన్ కాస్ట్ గనుల వేలంపాటదారులు ఇప్పటి వరకు ఆ గనులను చేపట్టలేదు కనుక వాటిని సింగరేణి సంస్థకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వెంకటనరసయ్య, విజయ్ కుమార్, రామకృష్ణ చారి, ఐలయ్య పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా, బొగ్గు బ్లాకులను వేలం వేయటాన్ని వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్పొరేట్‌లోని సెంట్రల్ వర్క్‌షాపులో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి వంగా వెంకట్ మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా సింగరేణి సంస్థకు ఇవ్వాలని, బీజేపీ ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమణమూర్తి, క్రిష్టాఫర్, అనంతలక్ష్మి, లక్ష్మీనారాయణ, రామ్‌శంకర్, నాగయ్య, రవీందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలి

ఇల్లెందురూరల్: అడవుల సంరక్షణను విస్మరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ హెచ్చరించారు. కొమరారం, కాచనపల్లి రేంజ్‌ల పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించారు. అనంతరం ఎఫ్‌డీఓ కార్యాలయంలో మాట్లాడారు. ఇల్లెందు డివిజన్ పరిధిలో పంపిణీ చేసిన పోడు భూముల వివరాలు ప్రతీ బీట్ అధికారి వద్ద సమగ్రంగా ఉండాలని చెప్పారు. పంపిణీ చేసిన భూమి కంటే అధిక విస్తీర్ణంలో రైతు కలిగి ఉంటే నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఏజెన్సీలో గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న అటవీభూమిపై సర్వే నిర్వహించి నివేదికను అందజేయాలని చెప్పారు. జూలై 1వ తేదీ నుంచి హరితహారం ప్రారంభిస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమంపై దృష్టి సారించాలన్నారు. అత్యధిక విస్తీర్ణంలో మంకీ ఫుడ్ కోర్టుల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, రేంజర్లు, డీఆర్‌వోలు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్

బదిలీలు, పదోన్నతులు కల్పించండి

ఇల్లెందురూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ భోజన విరామ సమయంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ.. 13 ఏళ్లుగా బదిలీలు, పదోన్నతులకు అవకాశం లేకుండా ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తోందని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 24న ఐటీడీఏ కేంద్రాలలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర్లు, పాపయ్య, రామయ్య, వసంత, రాధ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా శుక్రవారం టేకులపల్లి మండలంలోని అన్ని గిరిజన పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. హరిలాల్ మాట్లాడుతూ... ఉన్నతాధికారులు వెంటనే స్పందించి షెడ్యూల్ విడుదల చేయాలని లేదంటే రాష్ట్రంలోని అన్ని ఐటీడీటీడీఏ కేంద్రాల్లో 24వ తేదీన భారీ ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈ.ముత్తయ్య, ఎం.శారద, కె.లాలయ్య, టి.శ్రీనివాసరావు, బి.సైదులు, జె.సామ్య, సీహెచ్ వీరన్న, బి.నాగేశ్వరరావు, జానకి, జి.రవికుమార్, జి.భద్రు పాల్గొన్నారు.


టేకులపల్లి: కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో నిరసన తెలుపుతున్న గిరిజన ఉపాధ్యాయులు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ముస్లిం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ ఉర్దూఘర్ అధ్యక్షుడు నయీమ్ ఖురేషి శుక్రవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ... ఉర్దూఘర్ మరమ్మతులు, రినోవేషన్ కొరకు రూ.20 లక్షలు నిధులు కేటాయించాలని కోరారు. కొత్తగూడెం బోడుగుట్ట స్థలాన్ని ఖబరస్తాన్, ముస్లిం శ్మశానవాటికకు కేటాయించాలన్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో 50 సంవత్సరాల నుంచి ఒకే ఖబరస్తాన్, శ్మశానవాటిక ఉన్నప్పటికీ ఖననానికి స్థలం సరిపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షరీఫ్, అమీర్ ఖాద్రి, జావీద్ సతే తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సఫరాను నిలిపివేయడం జరుగుతుందని ఏఈ ప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీ కాలనీ, జయమ్మ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీనగర్, ఇందిరానగర్, శివనగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

ఇల్లెందురూరల్: స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 24న ఇల్లెందు సింగరేణి హైస్కూల్‌లో మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

దోమల నివారణపై దృష్టి పెట్టండి..

ఇల్లెందురూరల్: దోమలు వృద్ధి చెందుతున్న ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత అన్నారు. రేపల్లెవాడ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాలలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయిల్ చల్లించారు. నీరు నిల్వ ఉండటం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మట్టి పరీక్షలపై అవగాహన

సుజాతనగర్: సుజాతనగర్ రైతు వేదికలో మట్టి నమూనా సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ బాబూరావు, ఏడీఏ రమేష్, ఎంఏఓ నర్మద, అనిల్, రామారావు, ఏఈఓలు శరత్, నరసింహ, ప్రనుష తదితరులు పాల్గొన్నారు.

లేబర్ చట్టాలు కార్మికులకు ఉరితాళ్లు

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కార్మిక సంఘాలు ఎన్నో ఏళ్లు కష్టపడి రూపొందించిన 29 చట్టాలను రద్దు చేసిన మోదీ 2019లో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు అత్యంత ప్రమాదమని, లేబర్ కోడ్ రద్దుకై ఈనెల 23న మహబూబాబాద్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగు కోడ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, వీటిని రాష్ట్రంలోని ఏ పరిశ్రమలో అమలు చేయద్దని డిమాండ్ చేశారు.

పోలీసులకు శిక్షణ పూర్తి

ఇల్లెందు: క్రిమినల్ చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించేందుకు నాలుగో బ్యాచ్ శిక్షణ పూర్తి చేసినట్లు డీఎస్పీ ఎన్.చంద్రభాను తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 4వ బ్యాచ్‌కు శిక్షణ పూర్తి చేసి అవగాహన కల్పించినట్లు తెలిపారు. భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం–2023 ఈ మూడు చట్టాలు జులై 1 నుంచి అమలులోకి రానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టేకులపల్లి, గుండాల సీఐలు సురేష్, శ్రీనివాస్, ఎస్ఐ,ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన పోలీసులు

‘నీట్’ ద్రోహులను శిక్షించాలి

కొత్తగూడెంరూరల్: నీట్ ప్రశ్న పత్రం లీక్‌పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, నాయకులు తూము చౌదరి, కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ.. నీట్ యూజీ పరీక్ష 2024 ప్రశ్న పత్రం లీక్ వ్యవహారం, పరీక్షలలో భారీ సంఖ్యలో ఒకే రాష్ట్రంలో టాపర్లు రావడంతో అనుమానాలు వచ్చినట్లు చెప్పారు. అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో బండారం బయట పడిందన్నారు. దీనికి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ తరపున దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున్న ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌నాయక్, షేక్ మసూద్, చీకటి కార్తీక్, సుందర్‌లాల్‌కోరి ఉన్నారు.

ఇల్లెందు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీట్ పరీక్ష నిర్వాహకులను కాపాడుతోందని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డానియేల్ అన్నారు. కాంగ్రెస్ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఇల్లెందులో తహసీల్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ కోరీ, జాఫర్, యదళ్లపల్లి అనసూర్య, కొక్కు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

నీట్ పరీక్ష రద్దు చేయాలి...

నీట్ ఫలితాలలో వచ్చిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని, నీట్ పరీక్షను రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. శుక్రవారం ఇల్లెందు మండల కమిటీ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష రద్దు చేయాలని, దోషులను శిక్షించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నాయకులు ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఏ నబీ, టి.కృష్ణ, ఆలేటి కిరణ్, జలాల్, అభిమన్యు, ఎస్.విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి

ఇల్లెందు: ఒకనాటి సమైఖ్య రాష్ట్రంలో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుండగా ఆ అన్యాయాన్ని ఎలుగెత్తి చాటారు.. తెలంగాణ ప్రజలను సమీకరించి జాగృతం చేశారు... ఆ 60 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షను సాధించేందుకు తన జీవితాన్ని ధార పోసిన త్యాగజీవి ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఇల్లెందులో శుక్రవారం జగదాంబా సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి కిష్టయ్య, సత్యనారాయణ, జేకే శ్రీను, సందా బిందు, నబీ, గిన్నారపు రాజేష్, చాంద్‌పాషా, ఆదూరి రవి, ఖాజా, పోషం, ఘాజీ, రాజశేఖర్, నారాయణమ్మ పాల్గొన్నారు.

జూలూరుపాడు: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడు హైస్కూల్‌లో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ, భారత్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కృష్ణ, జేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇడుపుల రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహారావు, వెంకటప్పయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న దిండిగల రాజేందర్

పాల్వంచ: తెలంగాణ ఉద్యమ నేత జయశంకర్ ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ ఎండీ.మంజూర్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద ప్రొఫెసర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు. ఇజ్జగాని రవిగౌడ్, బొల్లం భాస్కర్, బుడగం నాగేశ్వరరావు, కొండం వెంకన్న, బరగడి దేవదానం, హుస్సేన్, నిమ్మల రాంబాబు, పూనెం రమేశ్, చంద్ర నర్సింహారావు, వెంకటాచారి, నాగేశ్వరరావు, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): కొత్తగూడెం ఏరియా రామవరంలోని టీబీజీకేఎస్ కార్యాయలంలో యూనియన్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ నిర్మాత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడప రాజయ్య, విజయ్, వెంకటేశ్వర్లు, సూరజ్, తిరుపతయ్య, సూరిబాబు, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

పొలం పండేలా.. సిరులు నిండేలా

- నేడు ఏరువాక పౌర్ణమి
- సాగుకు అన్నదాతల సమాయత్తం

ఈ ఏడాది వర్షాలు బాగుంటాయని వాతావరణ శాఖ నివేదిక ఇవ్వడం, ప్రస్తుతం ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటంతో అన్నదాత కొండంత ఆనందంతో ఉన్నాడు. ఈ ఏడాదైనా పంటలు సమృద్ధిగా పండి కష్టాలు తీరుతాయని గంపెడాశతో పొలం వైపు అడుగులు వేస్తున్నాడు. వర్షాలు కురిసి మంచి దిగుబడులు రావాలని హలదారులు దేవుడిని మొక్కుకుంటున్నారు. నేడు ఏరువాక పౌర్ణమి

ఇల్లెందురూరల్: జ్యేష్ఠ మాసం మొదలైన సమయానికి రుతుపవనాలు బలపడి వర్షాలు మొదలవుతాయి. ఒక వారం అటూ ఇటూ అయినా జ్యేష్ఠ పౌర్ణమి నాటికి తొలకరి పలకరించడం ఏటా సహజంగా జరిగే ప్రక్రియే.

ఇలా కురిసిన వర్షానికి నేలలో తేమ ఆవహించి మెత్తబడుతుంది. అంటే నాగలితో సాగే వ్యవసాయ పనులకు ఇది శుభసూచికం అన్నమాట. అందుకే ఈరోజున దుక్కులు దున్నే పనికి రైతులు శ్రీకారం చుడతారు. ఒక రకంగా ఏరువాక పౌర్ణమి వ్యవసాయానికి ఉగాది లాంటిది. కర్షకులకు వార్షిక క్యాలండర్ సూచన వంటిది.


దుక్కి సిద్ధం చేస్తున్న రైతు

పనిముట్లకు పూజ, ఎద్దులకు అలంకరణ...

ఏరువాక పౌర్ణమి రైతుకు పండుగ రోజు. అందుకే ఈ రోజున అన్నదాతలు తమ వ్యవసాయ పనిముట్లు అన్నింటిని కడిగి శుభ్రం చేసుకుంటారు. వాటికి పసుపు, కుంకుమ అద్ది పూజించుకుంటారు. ఇక ఎద్దులను శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులు పూస్తారు. కాళ్లకు గజ్జలు కట్టి, నడుముకు బెల్టు పెట్టి, పసుపు కుంకుమలతో అందంగా అలంకరించి హారతులిస్తారు. ఇంటి వద్ద రుచికరంగా చేసిన ప్రసాదాన్ని ఎద్దులకు తినిపిస్తారు.

భూమి పూజకు ప్రాధాన్యత...

వ్యవసాయం మానవ మనుగడకు జీవనాధారం. భారతీయుల సంప్రదాయం ప్రకారం భూమిని భూమాతగా కొలుస్తారు. అందుకే రైతులు వ్యవసాయాన్ని ఓ యజ్ఞంలా భావిస్తారు. ఈ కారణంగానే అన్నదాతలు పొలం గట్టుపై చెప్పులు వేసుకొని నడుస్తారు. కానీ పొలం లోపలకి దిగేటప్పుడు మాత్రం చెప్పులు వేసుకోరు. ఎందుకంటే ఆ క్షేత్రం రైతుకు దైవసమానం. అందుకే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు ముందు భూమిపూజ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం.

నేడు ఆ వైభవం లేదు..



ఏరువాక పౌర్ణమి వేడుకను గతంలో వైభవంగా జరుపుకునే వాళ్లం. నేడు ఆధునికతకు అలవాటు పడిన రైతులు సంప్రదాయన్ని విస్మరిస్తున్నారు. రైతు దైవంలా భావించే నేలను, వ్యవసాయానికి సాయపడే ఎద్దులను పూజించడం మరిచిపోయారు.

– కాయం పాపయ్య, రైతు, హనుమంతులపాడు

రైతులకు పండుగ



ఏరువాక పౌర్ణమి రైతులకు సంబంధించిన అతిపెద్ద పండుగ. తొలకరి ఆసన్నమవగానే దున్నడానికి సిద్ధంగా ఉన్న పంట పొలాన్ని శుద్ధి చేసుకొని సేద్యం మొదలుపెట్టే ఉత్సవంగా ఏరువాక పౌర్ణమిని జరుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం.

– మంచె కృష్ణయ్య, రైతు, కొమరారం